
కథ

# వీడే నా కొడుకు

రావు కృష్ణారావు



ఉలిక్కిపడ్డాడు మూర్తి. అదే మచ్చ! కుడి చెంప మీద భయంకరమైన మచ్చ.

వాల్తేరు రైల్వే స్టేషను ప్లాట్‌ఫాం చివర్న ఓ బెంచిమీద ప్రక్కనున్న యువకుని భుజం మీద తలవాల్చి ఉంది ఆమె. అవును... ఆమె... సావిత్రమ్మగారు తన చిన్నప్పుడు చూశాడు. అయినా పోల్చుకోగలడు. ఇప్పుడు మొహాన బొట్టు లేదు. అంటే మాష్టారు పోయారా? మరతనెవరు? రాజు కాదు కదా... అలా ఉన్నారేంటి? ఇహ ఉండబట్టలేక దగ్గరకెళ్లాడు. మూర్తి దగ్గరకు రావడం చూసి ఆ యువకుడు కంగారుగా లేవబోయాడు. ఆమె పక్కకు ఒరిగిపోయి ఆపుకుని సగం కళ్లు తెరిచి చూచింది. అవే కళ్లు. అంత మత్తుగా ఉందేమిటి? అనుకుంటుండగా ఆమె బెంచి మీదకు వాలి పడుకుంది.

"నీ పేరేంటి?" అడిగాడు మూర్తి.

"సత్యనారాయణ... ఎందుకు?" అన్నాడు బెరుగ్గా.

వీడు రాజు కాదన్నమాట. అనుకుంటూ 'ఆమె పేరు?' అడిగాడు.

"ఇంతకీ ఇవన్నీ మీకెందుకు? అసలు మీరెవరు?" ఎదురు ప్రశ్నించాడు సత్యనారాయణ. అతని మొహంలోనూ, మాటల్లోనూ ఖంగారు స్పష్టంగా తెలుస్తున్నది మూర్తికి. అతని వాలకం చూసి అనుమానమొచ్చింది. "ఆమె పేరు సావిత్రి. ఆమె భర్త సుబ్రహ్మణ్యం గారు. కొడుకు రాజు. కూతురు సరోజ. నేను ఎరుగుదును. ఆవిడలా ఎందుకుందో నువు ఎవరో, ఆవిడనెక్కడకు తీసుకెళుతున్నావో చెప్పకపోతే పోలీసులను పిలుస్తాను" తీవ్రస్వరంతో హెచ్చరించాడు.

అతను వణికిపోయాడు. "అంతా చెబుతాను సార్! ఇందులో నాతప్పేం లేదు. అంతా వీరబ్బాయిగారు చేయమన్నట్లే చేస్తున్నాను. నేను రాజశేఖరంగారి ఆఫీసులో డైలీవేజ్ అటెండర్ గా పనిచేస్తున్నాను. ఆయన ఇంటి దగ్గర డ్యూటీ నాది. ఆయనే ఈవిడ్ని రైలెక్కించేయమన్నారు" అని ఆగాడు.

"అంత జబ్బుగా ఉన్న మనిషిని రైలెక్కించమన్నాడా? ఎందుకు? ఏవూరు?" కోపంగా అడిగాడు మూర్తి.

"మీరెవరికి చెప్పనని మాటిస్తే నిజం చెబుతాను" భయం భయంగా

అన్నాడు.

"నిజం చెప్పు! అబద్ధం చెప్పావో నిన్ను వదల్ను"

మొహం మీది చెమటను చేత్తో తుడుచుకుంటూ, "ఈ అమ్మగార్కి మతి చలించింది సార్! వదిలించుకోడానికి రైలెక్కించమన్నారు"

దిగ్భ్రాంతి చెందాడు మూర్తి. ఒక్క నిముషం ఏమీ మాట్లాడలేకపోయాడు. మరునిముషం కోపంగా "ఆ బుద్ధిలేని వెధవ చెబితే తగుదునమ్మా అని నీవు తీసుకువచ్చావా? నిన్నూ..." అని అంతలోనే తమాయించుకుని "నీకు మనసెలా ఒప్పింది?"

"నేను ఒప్పుకోలేదు సార్! నేను చెప్పినట్లు చేయకపోతే నువ్వు రేపట్నుంచి డ్యూటీకి రానక్కర్లేదు. ఇంట్లో దొంగతనం చేశావని జైల్లో పెట్టిస్తాను. అంతా సజావుగా చేశావంటే నిన్ను పర్మినెంట్ చేయిస్తాను" అని బెదిరించారు సార్ మా అయ్యగారు అని ఆగి "నేనీ పని చేయకపోతే ఈవిడ్ని ఏ మందో, మాకో పెట్టి చంపేస్తారని భయపడ్డాను సార్" అతని కళ్లమ్మట నీళ్లు కారుతున్నాయి.

"మతెప్పుడు చలించింది. మాష్టారు ఏమయ్యారు?"

"సుబ్రహ్మణ్యంగారు చనిపోయిం తర్వాత మా అయ్యగారీవిడ్నింటికి తీసుకువచ్చారు. చాలాకాలం బాగానే వున్నారీవిడ. ఆర్నెల్ల క్రితం గొడవ జరిగింది తల్లీ కొడుకులకు. అప్పట్నుండే ఈవిడ పిచ్చిదానిలా తయారయ్యారు"

"గొడవెందుకు జరిగింది?"

"తన కూతురు, అల్లుడు చితికి పోయారని తనకు పుట్టింటివారు పసుపు కుంకాలుగా ఇచ్చిన భూమిని అమ్మి వాళ్లకిచ్చేశారట. అంతే కాదు ఈవిడికి చాలా బంగారముండేదట. అదంతా అమ్మి భర్త పేరు మీద వాళ్లూరి స్కూలుకు ఇచ్చేశారట. మా అయ్యగారికి కోపం వచ్చి తిట్టారు. దానికీవిడ 'అసలు న్యాయంగా తల్లి ఆస్తి కూతురికే చెందుతుంది. ఆ భూమి మా అమ్మది. నాకిచ్చారు. నా తర్వాతైనా సరోజకే వెళుతుంది. నాన్నగారి ఆస్తి అంతా నీకే ఉంది కదా! దాంతో పోలిస్తే ఇదెంత?' అన్నారు సార్ దాంతో అయ్యగారిక్కోపం వచ్చీవిడ మీద చేయి చేసుకున్నారు. దాంతో పెద్దమ్మగారికి కోపం వచ్చి ఇంట్లో నుండి వెళ్లిపోవడానికి బయలుదేరారు. మా అయ్యగారు మరింత రెచ్చిపోయి బెల్టు తీసుకుని తన చేతులు నొప్పెట్టే వరకూ బాదేసి గదిలోకి తోసి తాళమేసేశారు. మూడురోజులు దాకా తాళం తియ్యలేదు. అప్పట్నుండీ తనలో తను గొణుక్కోవడం, తనే నవ్వుకోవడం చేస్తున్నారు. ఏమీ పట్టించుకోరు. ఈవిడ బాగున్నప్పుడు నన్ను చాలా బాగా చూసేవారు సార్!" మళ్లీ అతని కళ్లల్లో నీరు.

"మరి వైద్యం చేయించలేదా?"

"వైజాగ్ మెంటలాస్పత్రిల్లో చేరుద్దామని ప్రయత్నించారు సార్. 'ఈవిడ జబ్బు తీవ్రమైంది కాదు. శ్రద్ధగా మందులు వాడితే పూర్తిగా నయమవుతుంది. బయట అదుపు చేయలేని వారిని మాత్రమే ఇక్కడ చేర్చుకుంటాం. ఇది అనాధాశ్రమం కాదు' అని చెప్పేశారు"

"ఈ విషయం సరోజకు తెలుసా?"

"తెలీదు సార్! ఆవిడకు తెలియనివ్వలేదు"

"ఈవిడేమయిందని తర్వాతైనా అడిగితే ఏం చెబుతారు?"

"నేను ఈవిడ్ని హాస్పటల్‌కు తీసుకెళ్లినట్లు మరుగుదొడ్డి కని వెళితే ఈవిడ కనిపించకుండా పోయినట్లు చెప్పమన్నారు."

"ఆవిడంతలా నిద్ర పోతున్నారేమిటి?"

"ఇంటి దగ్గర బయలుదేరినప్పుడు బాగానే వున్నారు. గొడవ చేస్తారని నిద్రమాత్రలెక్కువేశారేమో!"

"ఈవిడ్నేం చేస్తావిప్పుడు?"

"మద్రాసు టికెట్ కొన్నాను. లేడీస్ కంపార్ట్‌మెంట్‌లో ఎక్కించేస్తాను. తర్వాత దేవుడి దయ. ఈయమ్మకేం రాసిపెట్టుంటే అలా జరుగుతుంది. నన్ను క్షమించు తల్లీ" అని బల్ల మీద పడుకున్న సావిత్రమ్మగారి కాళ్లను కళ్లకద్దుకుని కింది పెదివిని ముందు పళ్లతో నొక్కుతూ దుఃఖాన్ని ఆపుకునే ప్రయత్నం చేయసాగాడు సత్యనారాయణ.

ఇంత దుర్మార్గమా?... తనలో అనుకుంటున్నట్లుగా పైకే అన్నాడు మూర్తి.

హౌరా మద్రాసు మెయిల్ వస్తున్నట్లు మైకులో ఎనౌన్స్‌మెంట్ వినిపించింది.


మూర్తి తీవ్రంగా ఆలోచించసాగాడు. ఏం చెయ్యాలి?... తను ప్రయాణం మానుకుంటే! అమ్మో ఎం.డి.గాడు రాక్షసుడు. ఊరుకోడు. తనకు రిజర్వేషనుంది. తన కంపార్ట్‌మెంట్‌లోనే ఎక్కిస్తే! ఒక్క క్షణం భయం వేసింది. ఈమె భారం శాశ్వతంగా మోయాలేమో! చెమటలు పట్టాయి. టై వదులు చేసుకుందామని చూశాడు. టై లేదు. 'వెధవ డ్రెస్సు! జీతం తక్కువయినా ఆర్భాటం ఎక్కువ. ఉక్క బోసి చస్తున్నాను!' విసుక్కున్నాడు.

మూర్తి మొహంలోకి ఆత్రంగా చూడసాగాడు సత్యనారాయణ. ఇంతలో మెయిల్ రాసాగింది. "ఏం చెయ్యమంటారు సార్?" ఆందోళనగా అడిగాడతను.

అప్పటివరకూ ఎంతో గంభీరంగా, హుందాగా ఉన్న మూర్తి ఆ ప్రశ్నతో ఒక్కసారే ముడుచుకుపోనట్లయిపోయాడు. తెల్లమొహం వేశాడు. ముద్దాయిలా మారిపోయాడు. ఏం మాట్లాడలేదు. రైలు వచ్చి ఆగింది.

"త్వరగా చెప్పండి సార్" అతని గొంతు జీరబోయింది.

"నన్నడుగుతావేంటి? నువ్వు ఏం చెయ్యాలనుకుంటే అది చెయ్యి" కోపంగా అని బ్రీఫ్‌కేస్ తీసుకొని తడబడుతున్నట్లుగా వెనక్కు తన కంపార్ట్‌మెంట్ వెతుకుతూ బయలుదేరాడు. సత్యనారాయణ సావిత్రమ్మగారిని లేపి ముందుకు నడిపించసాగాడు. మూర్తి ఆగి ఆగి మునివేళ్లపై లేచి మరీ వెనక్కు చూస్తున్నాడు. ఆమెను పెట్టెలోకి ఎక్కించడం కనిపించింది. మూర్తి తన కంపార్ట్‌మెంట్ దగ్గరకు చేరాడు. ఒక్క నిముషం ఆగాడు. పోనీ ఈ రోజు



ప్రయాణం మానేస్తే మళ్లీ అనుకున్నాడు. మళ్లీ ఎం.డి. జ్ఞాపకమొచ్చాడు. విసుక్కున్నాడు. 'అసలీ రైల్లోనే ఆమెనెందుకెక్కించాలి! అంతా తన ఖర్మ! ఆ రైల్లోనే తనూ ఎక్కితే సావిత్రమ్మగారి బాధ్యతంతా తన మీద పడబోతున్నట్లుగా భావించి భయపడసాగాడు. అనాలోచితంగానే పెట్టిలో కెళ్లి కూర్చున్నాడు. ఏం తోచలేదు. మళ్లీ ప్లాట్‌ఫాం మైకి దిగాడు. ఆమెనెక్కించిన పెట్టిదాకా వెళదామనుకున్నాడు. ధైర్యం చాలలేదు. 'ఛీ వెధవ బతుకు' విసుక్కున్నాడు. మళ్లీ పెట్టిలోకి ఎక్కి కూర్చున్నాడు. టీ వస్తే తీసుకుని తాగబోయాడు. చెయ్యి వణికి టీ ఫాంటుపై ఒలికింది. మళ్లీ విస్కుకున్నాడు. టీ రెండు సార్లు సిప్ చేసి గ్లాసుతో సహా బయట పారేశాడు. టీ ఒలికిన చోట తడి చేసి తుడుచుకుంటుండగా రైలు బయలుదేరింది. గబగబా గుమ్మం దగ్గరకు వెళ్లాడు. తన పెట్టె ప్లాట్‌ఫాం చివరకు వస్తుండగా కనిపించిన దృశ్యం మూర్తి గుండెను కలచివేసింది. సత్యనారాయణ తన తలను లైటు స్తంభంకేసి బాదుకుంటూ ఏడుస్తున్నాడు. ఒక ఎర్రచొక్కా పోర్టరు అతన్నాపుతున్నాడు.

మూర్తి బుర్ర మొద్దుబారిపోయింది. గుమ్మం దగ్గరే అలా నిలబడిపోయాడు. అలా ఎంతసేపు ఉండిపోయాడో గాని "కొంచెం తప్పుకుంటారా?" అని వినిపించి కొన్ని అడుగులు లోనికి వేసి నిలబడ్డాడు. సిగరెట్ వెలిగించి ఆలోచించనారంభించాడు. సావిత్రమ్మ గారిని తనింటికి తీసుకెళితేనో! అమ్మో! అసలే నాది అంతం మాత్రం జీతం. ఆమెను పోషించగలడా? సుధ ఒప్పుకోవద్దూ! తన తల్లిదండ్రులకే తను సాయపడలేక పోతున్నాడు. నెలలో అయిదువందలు తను పంపితే వాళ్లు చాలా సుఖంగా ఉంటారు. అదే తను పంపలేకపోతున్నాడు. 'ఇక నుంచి పొదుపుగా వుండి తల్లిదండ్రులకు ఎంతో కొంత పంపాలి' గతంలో కూడా తను చాలాసార్లు అనుకున్నాడు. మళ్లీ సావిత్రమ్మగారు జ్ఞాపకం వచ్చారు. మళ్లీ విసుక్కున్నాడు. కాళ్లు పీకుతున్నట్లనిపిస్తే తన సీట్లోకి వెళ్లి కూర్చున్నాడు. సావిత్రమ్మగారు! పాపం ఎంతమంచావిడ! ఆవిడకు రావలసిన కష్టమా ఇది. 'నాకు వీలుకాక! లేకుంటే ఆవిడనాదుకుందును' అని తనకు తాను సర్ది చెప్పుకున్నాడు.

సావిత్రమ్మగారి జ్ఞాపకాల్లో మునిగిపోయాడు. చిన్నప్పుడు తను టెన్త్ క్లాసు మాథ్స్‌లో ఫెయిలయితే నాన్న సుబ్రహ్మణ్యం మాష్టార్ని బతిమాలి ట్యూషన్ చెప్పించాడు. అసలు సుబ్రహ్మణ్యం మాష్టారు ట్యూషన్లు చెప్పరు. చాలా ఆస్తిపరులని చెప్పుకొనేవారు. నాలుగు నెలలపాటు ప్రతిరోజూ సాయంత్రం 5.30 నుండి 7 గంటలవరకూ, ఆదివారం రోజంతా లెక్కలు చెప్పేవారు. ఆయన చాలా సాదాసీదాగా ఉండేవారు. లెక్కలు బాగా చెప్పేవారు. తను వెళ్లడం ప్రారంభించిన మూడవరోజున తను మేష్టారుకి ఎదురుగా గచ్చుపై కూర్చొని లెక్కలు చేస్తుంటే రెండు చేతుల్లో ప్లేటు, అందులో కోవాబిళ్లలు దర్శనమిచ్చారు. చేతులకు కంకణాల్లాంటి లావైన బంగారు గాజులున్నాయి నిండుగా. అవి దేవతా హస్తాలనిపించాయి క్షణంపాటు. తలెత్తి చూసి హడిలిపోయాడు. ఆవిడ కుడిచెంప మీద భయంకరమైన మచ్చ. 'తీసుకోబాబు' అందావిడ. మచ్చను చూసి బిగుసుకుపోయిన తను 'తీసుకోరా' అన్న మాష్టారి మాటలతో చలనం వచ్చి పళ్లెం అందుకున్నాడు. ఆ రోజు మొదలుకొని తనకు రోజూ ఏదోటి పెట్టేది. ఆదివారం మధ్యాహ్నం భోజనానికింటికి వెళ్లనిచ్చేదికాదు. వాళ్ల పిల్లలతోటే తనకూ అన్నం పెట్టేది. ఆమె వండినవి చాలా గొప్పగా ఉండేవి. తనంత వరకూ ఎరగనివెన్నో తిన్నాడు ఆ ఇంట్లో.

టెన్త్ సప్లిమెంటరీలో మాథ్స్ మంచి మార్కులతో పాసయ్యాడు తను. తర్వాత తన తండ్రికి ట్రాన్స్‌ఫర్ కావడం వల్ల మళ్లీ మాష్టారుని కాని, సావిత్రమ్మగారిని కాని చూడలేదు. అయితే చాలాకాలం వరకూ ఏది తింటున్నా ఆవిడే గుర్తుకువచ్చేవారు. ఇది సావిత్రమ్మగారు వండినదెలా గుండేదో గుర్తుకు తెచ్చుకొనేవాడు.

రాజులా బాగా చదివుంటే తనూ అతని లాగే పెద్ద ఆఫీసరయ్యుండేవాడు. చిన్నప్పుడంతా సినిమాల పిచ్చితోనే గడిచింది. ఇంతకీ రాజు ఏ డిపార్ట్‌మెంటో కనుక్కోలేదు. ఛ! ఇలా అయిందేమిటి? ఆవిడకు రావలసిన కష్టమా ఇది? ఇంత అన్యాయం జరుగుతుంటే తనేమీ చేయలేకపోతున్నాడు. వెధవ బతుకు, వెధవ ఉద్యోగం. ఇంతకీ ఆ ఎం.డి.గాడు తన్నెందుకు రమ్మన్నాడో! కంపెనీ బిజినెస్ అంత బాగోలేదు. సేల్స్ పెంచాలంటూ టార్గెట్ ఫిక్స్ చేస్తాడేమో! అన్ని కంపెనీల అమ్మకాలూ తగ్గాయి. అలా అంటే ఆ మూర్ఖుడు వింటాడా? అసలెందుకు రమ్మన్నాడో! ఫలానా రోజు హెడ్డాఫీసులో ఎం.డి.గార్ని కలవాలని జి.యం. నుండి తాఖీదు అంతే. ఇంకేమీ తెలియదు. ట్రాన్స్‌ఫర్ చేస్తాడా? ఇలా తన గురించి కొంతసేపు, ఆమె గురించి కొంతసేపు ఆలోచిస్తూ ఉండిపోయాడు. ట్రైన్ రాజమండ్రిలో ఆగినపుడు హాకర్ల కేకలకీ లోకంలోకి వచ్చి గబగబా వెళ్లి లేడీస్ కంపార్ట్‌మెంట్‌లో ఆమె కోసం చూశాడు. ఆమె కనిపించలేదు. ట్రైన్ బయలుదేరుతుంటే పరుగెట్టుకెళ్లి తన కంపార్ట్‌మెంట్‌లో ఎక్కేశాడు. మళ్లీ విజయవాడలో ఆమెకోసం వెతికాడు. గుమ్మానికి అవతల దారిలో పడుకొనుంది. లేడీస్ కంపార్ట్‌మెంట్‌లోకి వెళ్లగూడదని తెలిసినా వెళ్లి లేపాడామెను. ఆమె కళ్లు బరువుగా ఎత్తి నిర్లిప్తంగా చూసింది. 'ఏమైనా తింటారా?' అని అడిగితే, 'ఊ' అంది. గబగబా వెళ్లి బ్రెడ్, ఆమ్లెట్ తెచ్చాడు. మళ్లీ లేపాడు. ఆమె నెమ్మదిగా లేచి కూర్చొంది. చిన్న ముక్క నోట్లో పెట్టుకుని మింగలేక 'మంచినీళ్లు' అంది. ఆమె ఏమి తాగివుండదు తన తెలివితక్కువ తనానికి తన్నే తిట్టుకుంటూ వాటర్ బాటిల్ కొని తెచ్చాడు. ఆమె కొన్ని నీళ్లు తాగి నెమ్మదిగా తినసాగింది. మూర్తి ఆమె కేసి చూస్తూ అలా ఉండిపోయాడు. ఆమె కొంత తిని 'వద్దు' అని ఇచ్చేసింది. మూర్తి బాటిల్ అందిచ్చాడు.

ట్రైన్ బయలుదేరుతున్నట్లు ఎనౌన్స్‌మెంట్ వినిపించింది. మూర్తి బయలుదేరుతుండగా 'వెళ్లిపోతున్నావా?' వినపడీ వినబడనట్లుగా వినిపించింది ఆమె గొంతు. మూర్తి గుండె పిండేసినట్లనిపించింది. వెనక్కు తిరిగి చూడకుండా వచ్చేశాడు. మూర్తి మనసు కొంచెం తేలికయింది. నిద్ర పట్టింది. మద్రాసులో పోర్టర్ల హడావుడికి మెళకువొచ్చింది.. ట్రైన్ దిగి గబగబా



లేడీస్ కంపార్ట్‌మెంట్ వైపు వెళ్లాడు. ఆమె లేదు. ప్లాట్‌ఫాం అన్నీ వెదికాడు. ఆమె కనిపించలేదు. దారిలో ఎక్కడైనా దిగిపోయిందేమో! బాధ కలిగింది. బాధలోనే మనసు తేలికయినట్లనిపించింది. తన మీద నుంచి పెద్ద బరువు దిగిపోయినట్లయింది. కొంచెం సిగ్గుపడ్డాడు.

హెడ్డాఫీసుకు దగ్గరలో చిన్న లాడ్జిలో దిగి స్నానం చేసి నీట్‌గా తయారై టై కట్టుకొని బయలుదేరాడు మూర్తి. సౌతిండియాలో టై ఏంటో దిక్కుమాలిన కల్చర్ తిట్టుకున్నాడు. టై, షూ లేకుండా వెళితే ఎం.డి. చిరాకుపడతాడు. డ్రెస్ కూడా చాలా నీట్‌గా ఉండాలంటాడు. చిత్రమేమిటంటే వాడు చాలా సింపుల్‌గా హాఫ్‌హాండ్స్ ఖద్దరు చొక్కా ఆకుచెప్పులతో ఉంటాడు. దొంగవెధవ! తిట్టుకున్నాడు. దారిలో టిఫిన్ తిని సిగరెట్ కాల్చి నెమ్మదిగా హెడ్డాఫీసుకు చేరాడు. జి.యం. ను. విష్ చేసి ఎందుకు పిలిపించారో అడుగుదామనుకుని, అడిగినా చెప్పడనిపించి ఊరకుండిపోయాడు. అరగంట తర్వాత ఎం.డి. రూమ్‌లోకి ప్రవేశం లభించింది.

"ఎలా ఉన్నావు మూర్తీ?" అడిగాడు అరవయాసలో.

"బానే ఉన్నానుసార్!" పరమ భయంకరుడు వీడు. 6,7 భాషలు తప్పుల్లేకుండా మాట్లాడతాడు. ఎపుడు నేర్చుకున్నాడో!

"కూర్చో! మొహం అలా ఉందేమిటి? దేనికో బాగా వర్రీ అవుతున్నట్లున్నావు?"

వీడికి ఫేస్ రీడింగ్ గూడా తెలుసా! అని ఆశ్చర్యపోతూ, "ఏం లేదుసార్! అదీ..." నసిగాడు.

"ఫర్వాలేదు. చెప్పు..."

"ఈ మధ్య మన సేల్స్ తగ్గాయి కదా... మీరేమంటారోఅని... భయం..." మింగేశాడు.

"నో మైడియర్! సేల్స్ తగ్గినా మిగతా కంపెనీల కంటే మనం బెటర్. ఈ దెబ్బతో రెండు, మూడు చిన్న కంపెనీలు లేచిపోతాయి. మనకు ఫ్యూచర్ బాగుంటుంది. ఒక్క క్షణం ఆగి అదీకాక కంపేరిటివ్‌గా నీ ఏరియా బెటర్" అన్నాడు ఎం.డి.

'హమ్మయ్య! మరెందుకు పిలిచినట్లు?'

"వ్యాపారానికి నిజాయితీ ముఖ్యమా? లాభం ముఖ్యమా?" హఠాత్తుగా అడిగాడు ఎం.డి.

మూర్తి బుర్ర చురుగ్గా పనిచేసింది. "లాభమే ముఖ్యం సార్! అయితే లాంగ్‌టర్మ్ ప్రాఫిట్స్ కోసం 'నిజాయితీపరులం' అని పేరు తెచ్చుకోవాలి."

"వెరీ గుడ్! నీకు ప్రమోషన్ ఇస్తున్నా! మనకు చాలా ముఖ్యమైన విజయవాడ జోన్‌కి నిన్ను మానేజర్‌గా వేస్తున్నా! ఆ జోన్‌లోని మూడు జిల్లాల్లో మన కంపెనీ నంబర్ వన్ కావాలి. ఆ బాధ్యత నీది. నువ్వు వారంరోజుల్లోగా విజయవాడలో చార్జి తీసుకోవాలి. ఇప్పటివరకూ మన కంపెనీలో ఎవ్వరికీ ఇవ్వని లిఫ్టు నీకిచ్చాను. నీ జీతం రెట్టింపవుతుంది. ఇంటి అద్దె, ఫోను బిల్లు కంపెనీ కడుతుంది. బైక్, సెల్‌ఫోను ఇస్తాం. నీవు బాగా కష్టపడతావని తెలుసు."

మూర్తి గుండె వేగం హెచ్చింది. చాలా ఎక్సైటింగ్ ఫీల్ అయ్యాడు. ముఖ్యంగా జీతం రెట్టింపు ఓహ్! వండర్‌ఫుల్. ఇంటి అద్దె, ఫోనుబిల్లు, సెల్‌ఫోను, ఇక డొక్కు స్కూటరుతో యాతన పడనక్కర్లేదు. ఒకేసారి ఇంత జంప్ ఎవ్వరికీ ఇవ్వలేదింతవరకూ! ఆ క్షణంలో ఎం.డి. దేవుళ్లా కనిపించాడు.

"వ్యాపారంలో దయాదాక్షిణ్యాలు పనికిరావు. నువ్వు వర్కర్స్ తరఫున మాట్లాడతావని తెలిసింది. అది మానుకో! తెలివిగానూ, కఠినంగానూ ప్రవర్తించడం నేర్చుకో! నువ్వు కష్టపడితే ఒకనాటికి ఈ కంపెనీ జనరల్ మానేజరవుతావు. ఇక నీవు వెళ్లవచ్చు."

మూర్తి నమస్కరించి వెనక్కు తిరిగేలోగా "మరోమాట. వ్యాపారంలో నాకు దయాదాక్షిణ్యాలుండవు. నా అంచనాల కనుగుణంగా నువ్వు పని చేయ్యకపోతే నిన్ను బయటకు పంపేయడానికే మాత్రం సందేహించను. బెస్ట్ ఆఫ్ లక్" అన్నాడు ఎం.డి.

సంతోషం, భయం కలగలసిపోయి ఉక్కిరి బిక్కిరయ్యాడు మూర్తి. హెడ్‌ఆఫీసు నుండి బయట పడ్డ మూర్తి చాలా ఉద్వేగభరితంగా ఉన్నాడు. తన కెరీర్‌లో చాలా పెద్ద లిఫ్ట్ ఇది. అయితే ఎం.డి. మాటలు కొన్ని అతని చెవుల్లో మార్మోగుతూ భయపెడుతున్నాయి. తన ప్రాబ్లమ్స్ చాలా వరకూ సాల్వ్ అవుతాయి. ఇంట్లోకి ఏమేం కొనాలో, కొనగలడో ఆలోచించ నారంభించాడు. సిగరెట్లు అయిపోయాయి. షాపు దగ్గరాగి 'గోల్డ్ ఫ్లాక్ ఫిల్టర్' అన్నాడు. తీరా అతనందించబోయేసరికి 'కింగ్' ఇమ్మన్నాడు. క్రమంగా మూర్తిలోని సంతోషం భయాన్ని అణచివేసింది.


లాడ్జికి చేరుకున్నాడు. లాడ్జి రూం చాలా చాలా చిరాగ్గా అనిపించింది. మళ్లీ వచ్చినపుడు తను ఇందులో దిగడు. ఎం.డి. రూం ఎంత బాగుంది! జి.ఎం. రూం కూడా. తన ఆఫీసు రూం కూడా... ఉహు! అలా కుదరదు. క్రిందివాళ్లు ఎందులోనూ తమతో సమంగా ఉండటం పైవాళ్లకి నచ్చదు. మూర్తి ఆలోచనలు మళ్లీ ఎం.డి. మీదకు మళ్లాయి. ఎంత తెలివైనవాడు! 'జి.ఎం. అవుతావు' అన్నాడు. మూర్తి మొహంలో ఆశ వెలిగింది. చిరునవ్వు చిందులేసింది. జి.ఎం. ఓహ్! మాటలు కాదు. తను చాలా కష్టపడాలి. గతంలో లా వర్కర్స్ తో మంచిగా ఉండడం కుదరదు. 'తప్పదు ఉద్యోగ ధర్మం' అనుకున్నాడు.


మూర్తి విజయవాడ వచ్చి సంవత్సరం దాటింది. బాగా బిజీ అయిపోయాడు. విపరీతమైన మానసిక ఒత్తిడి. బి.పి. వచ్చింది. తాగుడు అలవాటయ్యింది. ఖర్చు జీతానికి సరిపడా పెరిగిపోయింది. గతంలో తరచూ 'వెధవ ఉద్యోగం' అనుకొనేవాడు. ఇపుడలా అనుకోడానిక్కూడా తీరుబడి లేదు. గతంలో పుస్తకాలు చాలా ఇష్టంగా చదివేవాడు. ఇపుడు పేపర్లో బిజినెస్ న్యూస్ తప్ప మరేమీ చూడటం లేదు.

ఒకనాడు హఠాత్తుగా సావిత్రమ్మగారు కనిపించారు. ఒక కుష్టురోగి వేళ్లులేని తన చేతితో ఆమెను కొడుతున్నాడు. ఆమె చిన్నపిల్లలా నవ్వుతోంది. మూర్తి వాళ్లకు దగ్గరగా వెళ్లాడు.

"మింగుతావా?... ఇంకో నాలుగు తగిలించమంటావా?" అంటున్నాడతను.

"ఛీ! చేదు! నేను మింగను" అంటోంది సావిత్రమ్మగారు. జుట్టు, బట్టలు బాగా దుమ్ము కొట్టుకొని వున్నాయి. మనిషి బాగానే ఉంది! కుష్టురోగి మళ్లీ చెయ్యెత్తాడు.





"ఆగు" అన్నాడు మూర్తి. అతను ఆగి మూర్తి కేసి చూశాడు. తర్వాత చుట్టూ చూసి దరిదాపుల్లో ఎవరు లేరు కాబట్టి తన్నే ఆగమన్నాడని గ్రహించి ఆశ్చర్యంగా చూశాడు.

"ఆమె ఎవరు? ఎందుకు కొడుతున్నావు?"

"ఇది నా యమ్మ మేరీ. దీనికి జొరమొచ్చింది. మందుల షాపులో అడుక్కొని మాత్ర తెచ్చాను. ఏసుకోనంటంది. రెండు తగిలిత్తే అదే ఏసుకుంటది" అని మరుక్షణంలో "రూపాయి ధర్మం చేయండి బాబూ. పొద్దున్నుంచీ ఏవీ తినలేదిది టీ పోయిత్తాను" అన్నాడు.

"ఇప్పుడే కదా తాగానూ..." దీర్ఘం తీస్తూ అంది సావిత్రమ్మగారు.

"ఈవిడ మీ అమ్మకాదు! ఈవిడ పేరు సావిత్రి! నీకెక్కడ దొరికిందో చెప్పు" అన్నాడు మూర్తి.

అతని మొహంలో భయం స్పష్టంగా కనిపించింది. ఆమెకు దగ్గరగా ఓ అడుగేసి "ఇది నాయమ్మే" అన్నాడు. సావిత్రమ్మగారిదేమీ పట్టించుకోకుండా ఏదో గొణుక్కుంటూ తల గోక్కుంటోంది.

"ఈవిడ నాక్కావలసి నావిడ. మతి చలించి సంవత్సరం క్రితం ఇంట్లోంచి వెళ్లిపోయింది. మంచిగా ఈవిడ్ని నాకప్పగించకపోతే పోలీసు రిపోర్టిస్తాను."

"నేనియ్యను. ఇది నాయమ్మే! రమ్మను ఏనాకొడుకొత్తాడో... నరికేత్తాను" చొక్కా లేని, ఎముకలు కనిపించే ఛాతీని ముందుకు విరిచి చేతులు కొంచెం వెనక్కు వంచి నిలబడ్డాడు. తుంటి దగ్గర పక్కకు ఒరిగి ఉంది నడుము. ఆ ఫోజులో అతన్ని చూసి అతని మొహంలోని కోపం చూసి, అతని కోపం వెనక కారణాన్ని గ్రహించి మూర్తి చిన్నబోయాడు. విశ్వరూపం ధరించబోతున్న కృష్ణునిలా అనిపించాడతను క్షణంపాటు. కొన్ని నిముషాలు ఏమీ మాట్లాడలేకపోయాడు మూర్తి.

"అది కాదు! నీ పరిస్థితి ఇంత అధ్వాన్నంగా ఉంది. ఆమెను నీవెలా పోషిస్తావు" సానుభూతి నిండిన గొంతుతో నెమ్మదిగా అన్నాడు. ఆ మాటలకు జావగారిపోయాడతను. నిముషమాగి "అవును బాబూ! నిజమే వళ్లు బాగా పాడయింది. మిషనాస్పటల్లో చేరమని ఫాదర్ చాలా సార్లు తిట్టారు. జేరితే మళ్లీ ఉక్కుపిడుగయిపోతాను. కాని నెలదాకా వద్దు. ఈ నెలా మాయమ్మనెవరు సూత్తారు. అందుకే ఓ మార్గం ఆలోసించాను. మా జాన్ బాబాయికి ఓ వందరూపాయిలిత్తే మాయమ్మను జాగర్తగా సూసుకుంటాడు. ఏభై రూపాయాలు పోగేశాను. ఇంకో ఏభై పోగేసి అమ్మను బాబయి కప్పగించి ఆస్పటల్లో జేరిపోతాను"

అతని కళ్లలోని మెరుపు, మొహంలోని ఆశ చూసి ఆశ్చర్యపోయాడు మూర్తి.

"నీవే ముష్టి ఎత్తుకొనే వాడివి, ఆవిడను భరించడం కష్టం కాదా?"

"కాదు బాబూ! నాలాటోడు కూడు తింటుంటే కుక్కలు తప్ప మనుషులెవరూ మాకేసి రారు, సూడరు. ఈయమ్మ నాదగ్గరకొచ్చి అన్నంపెట్టమని అడిగింది. నువ్వు తినకూడదు నాకాడ అనిసెప్పినా ఇనకుండా నా ఎంగిలి కూడే తింది. కూడెడితే కుక్కైనా కొంతసేపే తోకాడిత్తూ ఎంట దిరుగుద్ది. ఈ యమ్మ మళ్లీ నన్నొదల్లేదు. అందుకే సారా తాగడం మానేసాను. చుట్టపీకలు ఏరుకొని కాలుత్తున్నా!"

మూర్తికింకేం మాట్లాడాలో అర్థం కాలేదు. అయినా ఎలాగోలా అతన్నొప్పించాలనే ఉద్దేశ్యంతో "ఆవిడ నీకు బరువే గాని ఆవిడ వల్ల నీకు ప్రయోజనమేంటి?" అడిగాడు.

"నాయమ్మ నాకు బరువేంటి? ఇవి నా పేణం. ఈ సేతుల్తో కూడు తిన్లేక నానా యాతన పడేవోడిని. అమ్మ ఒచ్చాక నాకు తినపిత్తన్నాది. కడుపునిండా తింటున్నాను. నీళ్లోసుకునేప్పుడు ఈపు తోముద్ది. దెబ్బలకి కట్లు కడతాది. ఎపుడైనా వండుకుంటే అమురుతంలా వండుద్ది. నా పక్కలోనే పండుకుంటాది. ఇంతకన్నా నా జనమకేం కావాలి?"

"అలా కాదు. నీకు వెయ్యిరూపాయిలిస్తాను. ఆమెను నాతో పంపు. వైద్యం చేయించి తర్వాత ఓల్డేజ్ హోంలో చేరుస్తాను. నీవు చూడాలనుకున్నపుడల్లా వెళ్లి చూడవచ్చు"

"అమ్మను ఓల్డేజిఓమ్‌లో జేరుత్తానని ఫాదర్ కూడా అన్నారు. నేనొప్పుకోలేదు. ఓల్డేజిఓమ్‌లలో ఉన్నాళ్లను నేనూ సూశాను. ఆళ్ల మొహాల్లో ఏదో ఇకారం. నాయమ్మ నాదగ్గరే చాలా సంతోసంగా ఉంటాది"

మూర్తి అతని ఇంగిత జ్ఞానాన్ని మెచ్చుకోకుండా ఉండలేకపోయాడు. చివరి ప్రయత్నం చేశాడు. 'ఆమె ఇలా నీతోనే ఉంటే నీ జబ్బు ఆవిడ కంటుకుంటుంది. అది ఆలోచించావా?"

ఒక్కసారిగా అతని కళ్లల్లో నీళ్లు పెల్లుబికాయి. మొహం చాలా దీనంగా మారిపోయింది. ముక్కులేని ఆ మొహంలోని విషాదాన్ని మూర్తి భరించలేకపోయాడు. అతను వెక్కుతూ తన మొండిచేత్తో కళ్లు తుడుచుకునే ప్రయత్నం చేశాడు. పిల్లి తన కాలితో మొహం తుడుచుకోవడం గుర్తుకువచ్చింది మూర్తికి. సావిత్రమ్మగారు తన చీరచెంగుతో అతని కళ్లు తుడిచారు. చాలాసేపు ఏడ్చి ఏడుపు ఆపుకొని ఏదో చెప్పబోయాడు. గొంతు సరిగా రాలేదు. చివరికి 'ఫాదర్ కూడా అదే అన్నారు. ఇప్పటికే అంటుకుందేమో పరీచ్చ చేయించమన్నారు. నేను దీన్ని తీసుకెళ్తే డాట్టరుబాబు నన్నొదలడు. ఆస్పటల్‌లోనే కట్టేత్తాడు. నేను జాయినయినపుడే దీన్ని కూడా పరీచ్చ సేయిత్తాను... అయినా ఎప్పటికైనా పెమాదమే" మళ్లీ ఏడవసాగాడు.

అతన్ని చూసి సావిత్రమ్మగారిపై అతనికున్న ప్రేమను చూసి మూర్తి మనసు పూర్తిగా చచ్చుబడిపోయింది. అతని ముందు తను సూర్యుని ముందు దివిటీలా ఫీలయ్యాడు. చిట్టచివరి ప్రయత్నంగా "ఆవిడ నాతోకూడా వస్తానంటే పంపుతావా?" అడిగాడు.

అతను చాలాసేపు వెక్కుతూ ఉండిపోయి చివరకు "ఊ! అడగండి" అన్నాడు.

మూర్తి చాలా సంతోషించాడు. సావిత్రమ్మగారి మొహంలోకి చూస్తూ ఆమెవైపు వంగి,

"అమ్మా! నేను మీ కొడుకు లాంటివాడిని. నాతో రండి. మిమ్మల్ని బాగా చూసుకుంటాను"

ఆమె మొహం కోపంగా మారిపోయింది. "ఛీ! నువ్వు నా కొడుకువి కావు" అని ఆగి అంతలోనే మళ్లీ నవ్వు మొహంతో అతని మెడచుట్టూ చెయ్యి వేసి "వీడే నా కొడుకు" అంది.

■